# “ఎండమావులు”

రచన :
... లొడగల క్రిష్ణ ...

“రఘూ!”

సాయంత్రం బీచికనిపోతున్న రఘూకు తలుపుచాటునుంచి సన్నగ వినపడింది. వెంటనే టక్కున ఆగిపోయేడు. మళ్ళీ తల వంకించి ముందుకు అడుగువేసేడు.

“బాబూ రఘూ!”

వినిపించుకోకుండానే చరచర నడిచిపోయేడు. ఆ పోవడం మళ్ళీ వెనక్కు తిరగకుండా తిన్నగా వెళ్లి ఇసుకలో కూర్చున్నాడు.

అప్పుడే అస్తమిస్తూన్న సూర్యభగవానుని అరుణకాంతులు విరిగే అలలమీదపడి తళతళలాడుతున్నాయి. ఇసుకలో ఆడుకుంటున్న తన చిన్నారిపాపను చూస్తూ అనిర్వచనీయానందము ననుభవిస్తోందొక గృహిణి. ప్రక్కన కూర్చొని ఆమెభర్త పేపరు చదువుతూ విశేషాలు వినిపిస్తున్నాడు. నల్లరాతిపైనకూర్చుని అలవచ్చినపుడల్లా క్రిందకు చూస్తూ ‘ఫిలిమ్ ఫేర్’ తిరగేస్తున్నాడొక విద్యార్థి. ఇంకా అటువేపున్న మనుష్యులెవరూ తిన్నెమూలాన్ని దృష్టికందలేదు.

రఘూ వాలులోనుంచి తిన్నెపైకివచ్చి చుట్టూ కలయజూసేడు. పడమటి దిశను సూర్యుడు చాలవరకు అదృశ్యమయేడు. మ్యునిసిపల్ దీపాలుకూడా వెలిగి దూరాన ఊరిలో మిలమిలమంటున్నాయి. పోదామనుకొన్నాడు, కాని కాళ్ళు సాగినవికావు. మళ్ళీ ఆలోచనల్లో మునిగితేల్తూ అలానే కూర్చున్నాడు.

“రఘూ” అని ఆమె పిలుపే ఎంతో మృదువుగ, సరళముగ వినపడుతున్నట్లనిపించింది. కాని తను ఏముఖంపెట్టుకొని ఆమెను చూస్తాడు? ఆనాడామె అన్నమాటే ఇప్పటికీ అతన్ని శూలంలా బాధపెట్టోంది. తను ఎవర్ని ఒక మహోన్నతవ్యక్తియని ఆరాధిస్తున్నాడో ఆమే అతినిష్ఠురంగా “బుద్ధిలేదు రఘూ!” అన్నది. నలుగురిలో అంతమాట అంటుందని కలనైనా అనుకోలేదు. ఇంతకీ తనేంచేశాడని? వుంగరాన్ని ఒకసారి చూస్తా ఆమెచేతిని వూగించేసు. అంతే! మరుక్షణంలో చేయి విదిలించుకొని తీవ్రంగా అన్నది— “బుద్ధిలేదా రఘూ! మతిపోయిందా యేం?” వెంటనే తలవంచుకొని వచ్చేసాడు, మళ్ళీ మూడుదినములవరకు ఆదారే మరచిపోయేడు.

ఇంతకుముందు తనెన్నిసార్లు ఆమెతో ఆడుకోలేదు. ఆ రోజుల్లో ఆమె తన్ను లాలించి ఆడించడము యిప్పటికీ జ్ఞాపకమున్నది. ఆమెచెప్పే తీయని కథలకోసం తనెన్నిసార్లు బడిమానేసి ఆమెదగ్గరికి పరుగెత్తలేదు! తను కనిపించగనే ఆనందంతో పొంగిపోయేది. తన జుట్టులో ఆమె సున్నితమైన వ్రేళ్ళుత్రిప్పుతూ కథలు చెప్తూంటే తను బడీ, ఇల్లూ అంతా మరచిపోయి కేరింతలుకొట్టూ వినేవాడు.

ఎప్పుడు తొమ్మిదేండ్లప్పుడు ఆమె కనిపించింది, ఎలా కనిపించిందో, యేమిటో అంతా అగమ్యగోచరం. కాని అప్పటినుంచీ ఆమెలో ఏదో అవ్యక్తాకర్షణ—లాలన ఆ తొమ్మిదేళ్ళ పసిహృదయాన్ని తనవైపుకు లాక్కున్నది. కాని యిప్పుడు రఘు పద్దెనిమిదేళ్ళ యువకుడు, ఏవో నూతనభావాలతో, వింత కోర్కెలతో అతని హృదయం వురకలు వేస్తుంది!

క్రమంగా చీకటి బాగా అలుముకొంది. పోదామని లేచేడు. ఆ యిల్లు సమీపిస్తున్న కొలదీ అతని ఆలోచనలన్నీ ఒకదరికిచేరి పేరుకొనసాగినవి. ఆ యిల్లు వచ్చింది. జోరుగా అడుగువెయ్యబోయేడు.

“రఘూ!” మెల్లగ వినిపించింది.

ఆమె ఇంకా అలానే నిలుచొనివుంది. వినిపించుకోకూడదనుకున్నాడు, కాని తనకు తెలీకుండానే గుమ్మం ముందుకుపోయి నిలుచున్నాడు. కాస్సేపటికి తేరుకొని కంఠంలోనికి లేని గంభీరతను తెచ్చుకొని అన్నాడు,

“ఏం? ఎందుకు మళ్ళీ పిలిచావు?”

“ముందు లోనికిరా బాబూ!”

“ఎందుకూ?” ఏమంటున్నాడో తనకు తెలీకుండానే అనేసాడు. ఆమె మళ్ళీకొంచెం కఠినముగా నెమ్మదిగా నొక్కి పలికింది. “లోనికిరా రఘూ!” ఇటూ అటూ చూచి మంత్రముగ్ధునిలా గబగబా గుమ్మం దాటి లోనికిపోయి కుర్చీలో కూర్చున్నాడు. పదేళ్ల నుండి ఆడుతూ పాడుతూ గడిపిన ఆ యిల్లు ఆవేళ క్రొత్తగ కనపడసాగింది. వింతగా గోడనున్న పటాలుచూస్తూ గట్టిగా శ్వాస పీల్చేడు.

ఆమెవచ్చి ఎదురుగా స్టాండునకానుకొని నిలబడింది. ఒక్కసారి మొగమెత్తి చూసి మళ్ళీ తల దించేసుకున్నాడు. ఆమెను చూడగానే ఏదో అభిమానం రేకెత్తి ఆనాటి అవమానం జ్ఞప్తికివచ్చింది. లేచి నిలుచున్నాడు.

“టైమయింది వెళ్తాను.”

“ఎక్కడికి బాబూ” ఆమె నవ్వుతూ మృదువుగా అన్నది “అయినా అంత అవసరమైతే వెళ్ళు మరి...”

ముందునకు అడుగువెయ్యలేకపోయేడు.

“నాకు తెలుసు రఘూ నువ్వన్నంత సులభంగా ఇక్కడ్నుంచి వెళ్ళలేవనీ.”

“ఏం? ఎందుచేత?”


తలెత్తి ఆమె ముఖంలోనికి చూసేడు. ఆమె పకపక నవ్వింది. ముత్యాలు పేర్చిన

ట్లున్న పలువరుస తళతళలాడింది. అతి నిర్మలముగ, గంభీరముగ మందహాసముచేస్తూ అన్నది.

"పదేళ్లనుంచీ నీతో ఆడుతూ, పాడుతూ వున్న వదినెను అంత సులభంగా విడిచెయ్యగలవా రఘూ?"

"ఏమో! ఆ సమయం వస్తుందేమో!"

"ఊహూ. ఎప్పటికీరాదు. నా రఘూను నానుంచి ఎవ్వరూ తీసుకోలేరు,"



అప్పటివరకూ ఆకాశంలో సంచరిస్తున్న రఘూ ఆమాటలు వినగానే అన్నీ మరచిపోయేడు. "వదినా..." ఇంకేమో అనబోయి వూరుకున్నాడు.

"కొంచెం కాఫీ తాగుదువుగాని రా బాబూ" అంటూ అతనిచేయి పట్టుకొని లోనికినడిచిందామె. విపరీతంగా సిగ్గు ఆవరించి అతను నోరు విప్పలేక పోయేడు. యంత్రంలా మెల్లిగా ఆమెవెంటే వంటగది లోనికి నడిచేడు.

"ఇప్పుడేమీ తినను. నాకు ఆకలిలేదు." ఆమెచేస్తున్న పరంజామాను చూస్తూ అన్నాడు రఘు.

"ఏం? నామీద కోపం యిలా తీర్చుకో దలిచావేమిటి? ఒక్క నిముషం నీ కోపాన్ని ఆవలికి నెట్టేయ్" అని నవ్వుతూ తినుబండారాలన్నీ పళ్ళెంలో తెచ్చి ముందుపెట్టింది.

ఇంక తప్పేమున్నా చికాకువస్తుందని మెల్లగా పళ్ళెం ఖాళీచేస్తున్నాడు రఘు, మనసులోని కోపం చాలవరకు మాసిపోయినా దాన్నంత తేలికగా బయటపెట్టేయ దలంచుకోలేదు. ఆమె కాఫీగ్లాసు క్రిందపెడుతూ అన్నది "ఏం బాబూ నామీద కోపమింకా చల్లారలేదా?"

"నీమీద కోపం యెందుకూ?" కాఫీ పళ్ళెన్ని ముందుకుతోస్తూ అన్నాడు.

"మరి ఆకలిలేదన్నా వెందుకనీ? సరేలే. అబద్ధాలాడటంకూడా నేర్చుకున్నావు" అంటూ లోనికిపోయి లైటువెలిగించి తెచ్చిందామె. అప్పుడే చేతులుకడుగుకొని తువాలు కని వెదుకుతున్నాడు రఘు.

"ఊం. దీంతో తుడుచుకో" అంటూ చీర చెంగు అందించింది. పసిపిల్లాడిలా చేతులూ, మూతీ తుడుచుకున్నాడు.

"ఇంక టైమయింది పోయి చదువుకో" అంటూ జవాబునకైనా నిరీక్షించకుండా పూజగదిలోనికి పోయిందామె.

ఇంటికిపోయి పుస్తకాలు ముందువేసుకొని పేజీలు తిరగేస్తున్నాడు రఘు. కానీ ఏవీ తలకెక్కడంలేదు. తన్నంతగా ఆదరించిన వదిన మనస్సును నొప్పించేనే యని బాధపడసాగేడు. మరి ఆనాడలా అందేం? అనదు మరీ, నలుగురిలో తనింకా పసిపిల్లాడిలా ప్రవర్తిస్తే! అదైనా లోకం కోసం అలా అన్నది కాని తనపై కోపం చేతకాదు. ఏమైనా తనేం యిప్పుడు పదేళ్ళవాడుకాడు. ఆమె తన్నెంత ఆప్యాయతగా ఆదరించింది! ఆ చూపులో, ఆ నిర్మలమైన నవ్వులోచిందే ఆత్మీయతను తలంచుకొని మురిసిపోయేడు. వదిన చాల మంచిదని చంటిపిల్లాడిలా కూడ బలుక్కున్నాడు.

ఆమె అసలుపేరేమిటో యిప్పటికీ తనకు తెలీదు. పదేండ్లక్రితం మొదటిసారిగా ఆమె పరిచయం లభించినప్పుడు అడిగేడు—

"......మరి నిన్నేమని పిలవాలి?"

"అక్కా! అను" ఆమె నవ్వుతూ అన్నది.

"ఏఅక్కని? చిన్నక్కా? పెద్దక్కా?" అమాయికంగా ప్రశ్నించేడు.

"సరే. అట్లాగైతే 'వదినా'అని పిలువు"

"వదినా!" మొట్టమొదటిసారిగ ఆమెను పిలిచేడు.

ఆ అమాయకపు పిలుపులో నేదో సన్నిహిత బాంధవ్యము కనిపించి, వాత్సల్యము ఊరకలువేసింది. నవ్వుతూంటే సొట్టలు పడుతున్న బుగ్గలను తనివితీరా ముద్దుపెట్టు

కొని మురిసిపోయిందామె. ఆ వేళ నుంచీ ఏదో శక్తి ఇద్దరి హృదయాలనూ చాల సన్నిహితులుగ చేసింది. ఒక్క రోజు రఘూ కనిపించకపోతే పిచ్చిదైపోయేదామె! వదిన్ని చూడందే నిద్రపోయేవాడు కాదు రఘు. ఏ బాంధవ్యమూ లేనివారు సన్నిహిత బంధువులయేరు.

తరువాత కొన్నాళ్ళకామె వివాహమైంది. మంగళవాయిద్యాలు మారుమ్రోగుతూంటే— ఆ అట్టహాసమంతా తన వదినకోసమే నని పొంగిపోయేడు రఘు. వెళ్ళిపోయేటప్పుడు రఘును గదిలోనికి తీసుకొనిపోయి ముద్దులాడి "మళ్ళీ వస్తాను రఘూ" అంటూ బండి యెక్కింది. వెళ్ళిపోతున్న బండివైపు వెర్రిగాచూస్తూ అలానే నిల్చుండిపోయేడు రఘు.

సంవత్సరం తిరక్కముందే నుదిటికుంకుమ చెరుపుకొని ఇంటికి వచ్చేసిందామె. అందరు గొల్లుమన్నారు. వదిన్ని చూసి పరుగెత్తుకొని పోయి ఆమెను చుట్టేసేడు రఘు. "నీకోసమే మళ్ళీ వచ్చేసాను రఘూ!" అంటూ హృదయాని కదుముకున్నది.

పూర్వంలా వదిన బీదికి రావటంలేదు. ఎప్పుడూ భగవద్గీత పఠిస్తూ ఉదాసీనంగా వుంటుంది. తను వెళ్తేనే నవ్వుతూ కాసేపు మాట్లాడుతుంది. తర్వాత మళ్ళీ పూజ గదిలోనికిపోయి భగవద్గీత పట్టుకుంటుంది. ఆమె హృదయంలో రెండేవస్తువులు శాశ్వతముద్ర వేసుకున్నవి. అవి రఘూ, భగవద్గీత!

కాలచక్రంలో ఎనిమిదేళ్ళు గిర్రున తిరిగినై. నూనూగుమీసాల నూత్న యౌవనంలో మిసమిసలాడుతున్నాడు రఘు. కాని వదినదగ్గర మాత్రం యింకా పసిపిల్లాడివలెనే మెలుగుతున్నాడు. ఆమెమాత్రం పూర్వంవలె కాకుండా సాధ్యమైనంత ఎడంగా తిరుగుతున్నది. తన రఘూ ఎల్లప్పుడూ తనవద్ద నుండడమే ఆమె కోరుతుంది. కాని పద్ధెనిమిదేండ్ల యువకుడు తనవద్ద మాటికీ పసిపిల్లాడిలా మెలగడం అతని భవిష్యత్తున కెంత భంగమో తెలుసుకొన్నది. కాని రఘు మాత్రం ఇవేవీ గమనించక మామూలుగానే ప్రవర్తిస్తున్నాడు.

దీపం వెలుగుతూనేవుంది! పుస్తకం తెరిచేవుంది. కాని రఘు మనసు మాత్రం గత స్మృతులను నెమరువేయజొచ్చింది. వదిన గతజీవితాన్నీ, నిర్మలతనూ తలంచుకొని ఆమె సాధారణవ్యక్తి కాదనుకున్నాడు. ఆమెలో ఏదో దివ్యశక్తివున్నది. అది యీ సంఘానికి సామాన్య మానవులకు అతీతమయినది. ఆ దివ్యశక్తితోనే వెన్నెలకురిసే జీవితం చీకటిమయమైనా సహించగలిగింది. ఒక పవిత్ర స్థానాన్నలంకరించిన ఆమెను పసివాడిలా అందరిలో చేతులంపట్టుకొని వూగిస్తే ఆమెకెంత కళంకము! యుక్తాయుక్తములు విచక్షణచేసే ఆమె అలాగన్నది, అందులో తప్పేమీ లేదనిపించినది.

మరుక్షణంలో "నా రఘును నానుంచి ఎవ్వరూ తీసుకోలేరు" అన్న ఆమె మాటే వినిపించినది. చుట్టూ ఆమె వేయిగొంతులతో "నా రఘుని ఎవ్వరూ తీసుకోలేరు" అని అంటున్నట్లనిపించింది. ఒక నిష్కల్మష హృదయానికి బాధ కలిగించేనని కుమిలిపోసాగేడు రఘు. "వెంటనేపోయి ఆమెను క్షమాపణ కోరుకోమని ఎవరో ఎలుగెత్తి చెప్తున్నట్లనిపించింది. గబాల్న పుస్తకం మూసేసి వదినదగ్గరికి పరుగెత్తాడు.

ఆమె పూజగదిలో తదేకధ్యానంతో భగవద్గీత చదువుతోంది.

"వదినా!..." నెమ్మదిగ పిలిచేడు రఘు. ఆమె తిరిగిచూచింది.

"ఎవరూ? రఘూ! ఇంతరాత్రివేళ ఇలా వచ్చావేం బాబూ?"

సన్నని లాంతరువెలుగులో ఆమెవదనము ఏదో దివ్యతేజస్సును వెదజల్లుతూన్నట్లనిపించినది. ఆ వదనాన్ని చూస్తుంటే అతనిగుండెలు బరువెక్కిపోతున్నాయి. తటాల్న పోయి ఆమెచేతులు పట్టుకుని నెమ్మదిగా అన్నాడు "నన్ను క్షమించు వదినా!"

"ఎందుకూ?"

"నీ పవిత్ర హృదయానికి బాధ కలిగించేను. నన్ను క్షమించేనను వదినా!"

"పరేలే!"

"వదినా!" అంటూ తేలికహృదయంతో ఆమెమీదికి వాలిపోయేడు రఘు. "పిచ్చితండ్రీ" అంటూ అతని చెక్కిళ్ళు ప్రేమతో నిమిరిందామె.


## కామధేను

ఇది విలువైన మలయాళ మూలికలతో ప్రాచీనాయుర్వేదపద్ధతిని శాస్త్రీయంగా తయారైన గొప్పమందు. వ్యాధిగ్రస్తులే కాక ఎట్టి వ్యాధిలేనివారుకూడ దీనినిసేవిస్తే దేహన్ని బలపరచి రసాయనంగా పనిచేయును.

**దీనిని స్త్రీ పురుషులు నిరభ్యంతరముగా వాడవచ్చును. మందు మంచి రుచిగావుండును. పథ్యము లేదు.**

వీర్యనష్టం, ఋతుదోషం, నరముల నిస్సత్తువ, సెగరోగం, మూత్రదోషం మొదలయిన వ్యాధులకు ఈ మందు పెట్టింది పేరు. మూత్రముతోపోవు శుక్లమును, మేహదుర్వాసను, మేహవ్యాధిని, మేహదురదను, మూగతీటను, జననేంద్రియ సంబంధమైన రుగ్మతలను, జననేంద్రియం సన్నబడుట, చిక్కిపోవుట, లేపనశక్తి తగ్గివుండుట, మధుమేహం, నిద్రలేమి, ధాతు దృఢీకరణం లేకుండుట, నరముల నిస్సత్తువ మున్నగు వ్యాధులను ఇది తప్పక కుదుర్చును. మేహకాక, మూలకాక, గుండెదడ, వెన్నునొప్పి, దగ్గు, కాసము మున్నగు బాధలను నివారణచేయును.

ఆకలిలేమి, మలబద్ధకం, నీరుకుట్టు, నడుమునొప్పి, కాళ్లుచేతులు తీట, తెలుపువ్యాధి, తలత్రిప్పట, జ్ఞాపకశక్తి తగ్గుట మొదలైన బాధలను నివారించి బలాన్ని, ఆరోగ్యాన్ని, దేహకాంతిని యిచ్చి యెంతో మేలుచేయును. శీఘ్రంగా ముసలితనం రాకుండా చేస్తుంది. డబ్బి 1-8 రు. 3—0—0

**ధనలక్ష్మి అండ్ కో., — సౌకార్‌పేట, మద్రాసు-1.**